క్లుప్తంగా

ఆత్మరక్షణకు కరాటే



పతకాలు సాధించిన విద్యార్థులతో ఎస్సై

గంగాధర: ఆత్మరక్షణకు అమ్మాయిలు కరాటేలో శిక్షణ పొందాలని ఎస్సై నరేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని గర్శకుర్తి ఫంక్షన్ హాల్‌లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటేలో పలు పరీక్షలు నిర్వహించారు. సరస్వతి స్కూల్‌కు చెందిన 70 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి వివిధ రకాల బెల్టులు, పతకాలు సాధించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువుతో పాటు శారీరక ధృడత్వం అవసరమన్నారు. కార్యక్రమంలో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఎగ్జామినర్ వసంత్‌కుమార్, కరస్పాండెంట్ మిట్టపల్లి రాజశేఖర్, ప్రిన్సిపాల్ మాధవి, మాస్టర్ శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రభుత్వం స్పందించాలి

చొప్పదండి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలలో కుక్కలు కరిచే గ్యారంటీ కనిపిస్తోందని, దీన్ని అనధికారికంగా చేర్చారా అని ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి విమర్శించారు. రాగంపేటకు చెందిన పలువురు కుక్కల దాడిలో గాయపడగా చొప్పదండి ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులను బుధవారం పరామర్శించారు. ప్రజలను కుక్కలు కరుస్తుంటే ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. పంచాయతీరాజ్‌శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చి ప్రజలు కుక్కలబారిన పడకుండా చూడాలని, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పందించాలని కోరారు.

కంటి వైద్యశిబిరం

గంగాధర: మండలంలోని తాడిజర్రి గ్రామంలో బుధవారం బుచ్చమ్మ చంద్రమౌళి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలందరికి సేవలందించడమే ట్రస్టు ధ్యేయమని నిర్వాహకులు అన్నారు. దాదాపు వంద మందికి పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేశారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు రాజలింగంరీటరీ బహదూర్‌షా, డ్యూటీ డాక్టర్ అనూషరెడ్డి, కౌన్సిలర్ రాజు, విజన్ పరిశీలకుడు అన్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణంపై ఎంపీవో విచారణ

శంకరపట్నం: మండలంలోని కరీంపేటలో గ్రామ పంచాయతీ స్థలంలో ఇంటి నిర్మాణం చేస్తున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈమేరకు బుధవారం ఎంపీవో ప్రభాకర్ విచారణ చేశారు. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టగా పనులు అడ్డుకున్నామని ఎంపీవో తెలిపారు. స్థలం విషయంలో గ్రామపంచాయతీ, ఇంటి యజమాని మధ్య వివాదం పరిష్కరించేందుకు భూమిపత్రాలు అందజేస్తే సర్వే చేస్తామన్నారు.

కుక్కలు, కోతుల దాడిలో పలువురికి గాయాలు

చొప్పదండి: రాగంపేటలో బుధవారం ఉదయం కుక్కల దాడిలో పలువురు గాయపడ్డారు. దయ్యాల లస్మయ్య, దీకొండ లక్ష్మి, సిర్ర రిషిక, లింగమ్మ తదితరులు గాయపడగా.. వారికి చొప్పదండి పీహెచ్‌సీలో చికిత్స చేసి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మి, లింగమ్మ ఉదయం కల్లాపి చల్లుతుండగా.. కుక్కలు గాయపరిచాయి. రిషిక ఇంటి ఎదుట నిలబడి ఉండగా.. దాడి చేశాయి. లస్మయ్య నడకకు వెళ్లగా ఎగబడి గాయపరిచాయి. ఆవుల లక్ష్మిని బెదిరించడంతో.. కింద పడిపోయింది. ఆమె కాలును కరిచాయి.

శంకరపట్నం మండలంలో..

శంకరపట్నం: మండలంలో కోతులు, కుక్కల దాడిలో బుధవారం నలుగురికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. కేశవపట్నంలో కుక్కల దాడిలో స్రవంతి, చింతలపల్లి, మొలంగూర్, అంబాల్‌పూర్ గ్రామానికి చెందిన మల్లారెడ్డి, మణెమ్మ, జ్యోతిని కోతులు గాయపర్చాయి. కోతులు, కుక్కల దాడిలో గాయపడిన నలుగురు కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు.

నలుగురిపై కేసు

జమ్మికుంట: ఆస్తిరాకుండా చేస్తున్నారనే ఫిర్యాదుతో నలుగురిపై బుధవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రవి తెలిపారు. కొత్తపల్లికి చెందిన మహిళ పన్నెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. తండ్రి మృతి చెందగా తల్లి, నానమ్మ, అన్న, చెల్లి ఆస్తి తనకు రాకుండా చేశారని బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

వ్యక్తిపై గడ్డపారతో దాడి

వీణవంక: మండలంలోని హిమ్మత్‌నగర్‌లో దొండపాటి సంపత్ రెడ్డిపై అదే గ్రామానికి చెందిన దొండపాటి భగవాన్ రెడ్డి, దొండపాటి పద్మ దాడి చేశారు. పోలీసుల తెలిపిన వివరాలు.. సంపత్ రెడ్డి ఇంటి గేటును భగవాన్ రెడ్డి, పద్మ గడ్డపారతో పగలగొడుతుండగా అడ్డుకున్నందుకు గడ్డపారతో దాడి చేయగా సంపత్ రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబీకులు జమ్మికుంట ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో భగవాన్ రెడ్డి, పద్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

ఆహ్లాదం పంచని వనాలు..

- మండలంలోని అన్నిగ్రామాల్లో పల్లెప్రకృతి వనాలు ఏర్పాటు
- వనాల్లో నాటిన మొక్కలు 23 వేలకు పైనే
- నిరుపయోగంగా దర్శనమిస్తున్న వైనం
- ఇళ్ల నుంచి బయటకు రాని ప్రజలు
- నిర్వహణ బాధ్యత పంచాయతీలకు
- వేసవిలో మొక్కలను సంరక్షించకుంటే ఎండిపోయే ప్రమాదం



బొమ్మనపల్లిలో పల్లెప్రకృతి వనం

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో ప్రజలు సేదతీరేందుకు జాతీయ ఉపాధిహామీ పథకం కింద పల్లెప్రకృతి వనాలు ఏర్పాటు చేయగా వినియోగించుకునేవారు కరువయ్యారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడంలేదు. మరోవైపు వేసవి సమీపించడంతో నాలుగు నెలలు మొక్కలను సంరక్షించకుంటే మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉంది. 2020లో మండలంలోని అన్ని గ్రామాల్లో పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ఎకరా స్థలంలో ఏర్పాటు చేయాల్సి ఉండగా ప్రభుత్వ స్థలాలు లేక పది నుంచి ఇరవై గుంటలు కేటాయించారు. రకరకాల మొక్కలు నాటడంతో పాటు నడిచేందుకు ట్రాక్ నిర్మించారు. చిగురుమామిడి, సుందరగిరి గ్రామాల్లో మాత్రమే వనాల కోసం ఎకరా స్థలం కేటాయించారు. వనాల్లో దాదాపు 23 వేల మొక్కలు నాటారు. ప్రస్తుతం మొక్కలు పెరిగి పెద్దగా అయ్యాయి. ఇవి గ్రామాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచినప్పటికీ ప్రజలు ఆహ్లాదం కోసం పార్కులకు రావడం లేదు. పల్లెప్రకృతి వనాల సంరక్షణకు వాచర్లను ఏర్పాటు చేశారు. నెలకు రూ.ఐదు వేల వేతనం చెల్లిస్తున్నారు. కానీ అధికారులు శాశ్వత నీటి సౌకర్యం కల్పించలేదు. ఫలితంగా మొక్కలు, వృక్షాలు ఎండిపోయే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల పాటు వాచర్‌మెన్లు మొక్కలకు నీటిని అందించడంతో పశువుల బారి నుంచి కాపాడారు. తర్వాత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు వనాల సంరక్షణ బాధ్యత అప్పగించి వాచర్‌మెన్లను తొలగించింది. వనాలకు అందుబాటులో ఎలాంటి బోరుబావులు లేవు, వేసవిలో మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉందని అధికారులు శాశ్వత నీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రకృతి వనాల నిర్వహణ బాధ్యతను జిల్లా ఉన్నతాధికారులు గ్రామ పంచాయతీలకు అప్పగించారు. పాలకవర్గాల పదవీకాలం ముగిసినప్పటి నుంచి పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సంరక్షిస్తున్నారు. మొక్కల సంరక్షణకు వారానికి రెండుసార్లు నీరు పట్టాలి. కొన్ని గ్రామపంచాయతీల్లో ట్యాంకర్ల ద్వారా నీరు సరిగా అందించడంలేదని విమర్శలు వెలువడుతున్నాయి.

మొక్కల పెంపకం ఇలా

ఆయా ప్రకృతి వనాల్లో వందల సంఖ్యలో మొక్కలు నాటారు. చిగురుమామిడిలో 4194, బొమ్మనపల్లిలో 961, గాగిరెడ్డిపల్లిలో 330, గునుకులపల్లిలో 2064, ఇందుర్తిలో 1270, కొండాపూర్‌లో 720, లంబాడిపల్లిలో 200, ముదిమాణిక్యంలో 1728, ముల్కనూర్ 900, నవాబుపేట్‌లో 900, ఓగులాపూర్‌లో 1867, పీచుపల్లిలో 380, రామంచలో 1970, రేకొండలో 1160, సీతారాంపూర్‌లో 1100, సుందరగిరిలో 2650, ఉల్లంపల్లిలో 600 చొప్పున నాటారు.



వాకర్స్ కోసం ఏర్పాటు చేసిన ట్రాక్

చర్యలు తీసుకుంటున్నాం



పల్లెప్రకృతి వనాల సంరక్షణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. మొక్కలను కాపాడేందుకు పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించాం. వారానికి రెండుసార్లు ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీరు పట్టిస్తున్నాం. వృద్ధులు, వాకర్స్ వనాలు ఉపయోగించుకోవాలి.

– మధుసూదన్, ఎంపీడీవో, చిగురుమామిడి



ఉత్సవమూర్తులను తీసుకెళ్తున్న వేదపండితులు

వైభవంగా వసంతోత్సవం

రామడుగు: మండలంలోని వెలిచాలలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం హవనం, నిత్యహోమం, గ్రామంలోని నందనవనం(పార్కు)లో వసంతోత్సవం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, మాజీ జెడ్పీటీసీ కవిత, మాజీ సర్పంచ్ సరోజన, రవీందర్‌రావు పలువురు పాల్గొన్నారు.

భూమిపూజ



మానకొండూర్: భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

మానకొండూర్: మండలంలోని గంగిపల్లి గ్రామ శివారులోని ఏదుగుట్ట మల్లికార్జునస్వామి ఆలయ ఆర్చీ కోసం వన్నారం గ్రామస్తులు బుధవారం భూమిపూజ చేశారు. ఆర్చీ నిర్మాణానికి గ్రామస్తులే విరాళాల రూపంలో రూ.నాలుగు లక్షలు సమకూర్చారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్, రైతు ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ నాయకుడు రామారావు, గ్రామ కార్యదర్శి శారద, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టరు ఓదెలు, మాజీ ఎంపీటీసీ రవి, మాజీ ఉప సర్పంచ్‌లు తిరుపతి, తిరుపతి, యాదగిరిరావు, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ సమస్యలు పరిష్కరిస్తాం

రిజిస్ట్రార్ ప్రవీణ్ కుమార్

తిమ్మాపూర్: ఎల్‌ఆర్‌ఎస్ సమస్యలు పరిష్కరిస్తామని జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. తిమ్మాపూర్ సబ్ రిజిస్ట్రరార్ కార్యాలయాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. క్రయ, విక్రయదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌లో ఎదురవుతున్న సమస్యలను తనదృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ పార్థసారథి, శంకర్, మంజుల, బేగ్, బలరాం పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ స్వప్న, అధికారులు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ చైర్‌పర్సన్ పూల్లూరి స్వప్న సదానందం అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. మార్కెట్ పరిధిలోని గ్రామాల్లో లింకురోడ్లు, 2025–26 సంవత్సర బడ్జెట్ ఆదాయం, వ్యయం చర్చించి ఆమోదించారు. పాత, కొత్త వ్యవసాయ మార్కెట్ గోదాంలు, టాయిలెట్స్, కాంపౌండ్ వాల్స్, రైతు విశ్రాంతి భవనం అంచనాపై తీర్మానం చేశారు. మండలంలోని వావిలాల మార్కెట్ స్థలంలో 5,000 మెట్రిక్ టన్నులు, వీణవంక, ఇల్లందకుంట మండలాల్లో నాబార్డు గోదాంల నిర్మాణం కోసం స్థల సేకరణ చేయడానికి రెవెన్యూశాఖ తీర్మానం కోసం ప్రభుత్వం, మార్కెటింగ్‌శాఖకు లేఖ అందించేందుకు తీర్మానించారు. కార్యక్రమంలో ఉన్నత శ్రేణి కార్యదర్శి మల్లేశం, గ్రేడ్–2 కార్యదర్శి రాజా, వైస్ చైర్మన్ సతీశ్‌రెడ్డి, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి రూ.7,150

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి గరిష్టంగా రూ.7,150 ధర పలికింది. బుధవారం మార్కెట్‌కు 138 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. మోడల్ ధర రూ.7,100, కనిష్ఠ ధర రూ.7,000 ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు.

హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గం

హుజూరాబాద్: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు బుధవారం పట్టణంలోని మధువని గార్డెన్‌లో నిర్వహించారు. అధ్యక్షుడిగా కాయిత రాములు, ప్రధాన కార్యదర్శిగా కామని రవీందర్ గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా పిల్లల సతీశ్‌కుమార్, ముష్క శ్రీనివాస్, మాడ రవీందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా కుడిక్యాల సాయిలు, మచ్చిక చందు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గొస్కుల రాజ్‌కుమార్, కోశాధికారిగా కేశబోయిన స్వామి, కార్యవర్గ సభ్యులుగా హర్షిల్ అజీమ్, నాగవల్లి రాజు, మంతెన కిరణ్‌కుమార్, భరత రజినీకాంత్, అబ్దుల్ ఫహీం, బత్తుల రాజలింగం, పోతురాజు సంపత్, చిర్ర సుదర్శన్, తాటిపాముల దేవేందర్, మర్రి శ్రీనివాసును ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శి మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యలతో పాటు నివేశన స్థలాలపై ఉద్యమిస్తాన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాండ్ల శ్రీనివాస్, కొయ్యడ చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్, స్టేట్ హెల్త్ కమిటీ మెంబెర్ మహీంద్రాచారి జర్నలిస్టులు పాల్గొన్నారు.

16న అర్బన్ బ్యాంక్ సర్వసభ్య సమావేశం

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సర్వసభ్య సమావేశం ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రెవెన్యూ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు జరగనున్న సమావేశానికి కరీంనగర్, జగిత్యాల, మధురానగర్(గంగాధర) శాఖల సభ్యులు హాజరు కావాలని కోరారు.

ఎంపీ వైఖరి సరికాదు

కరీంనగర్: తెలుగు రాష్ట్రాల్లో వాల్మీకి బోయలు ఆర్థికంగా వెనకబడి ఉన్నందున వీరిని ఎస్టీ జాబితాలో కలపాలని మహబూబ్‌నగర్ బీజేపీ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ పార్లమెంట్‌లో మాట్లాడటాన్ని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోడ మోహన్‌నాయక్, భీమా సాహెబ్ ఒక ప్రకటనలో ఖండించారు.

నిధులు కేటాయించాలి

కరీంనగర్: సహకార సంఘాల సొసైటీల ద్వారా నిధులు కేటాయించి జీవాలను పెంచే రైతులకు అండగా ఉండాలని యాదవ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి సందబోయిన ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి

కరీంనగర్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పూసల విష్ణు డిమాండ్ చేశారు. బుధవారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తామని, అధిక నిధులు కేటాయించి విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తామని అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందన్నారు. నగర కార్యదర్శి బామాండ్ల నందు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

30 శాతం నిధులు కేటాయించాలి

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం సంఘ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారావు, జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాముయాదవ్, జిల్లా నాయకులు సురేశ్, ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



రామడుగు: మండలంలోని వెదిరలో రోడ్డుపై మురుగునీరు పారకుండా ఎంపీవో శ్రావణ్‌కుమార్ ఆదేశాలతో కారోబార్ అశోక్‌రెడ్డి చర్యలు చేపట్టారు. బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రోడ్డుపైకి మురుగునీరు రాకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను పంచాయతీ సిబ్బంది బుధవారం తొలగించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి స్పందన

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ



వివరాలు తెలుసుకుంటున్న సీపీ గౌస్ ఆలం

చొప్పదండి: సరైన పద్ధతిలో రికార్డులు నిర్వహించాలని, కేసుల వివరాలు సీసీటీఎన్ఎస్‌లో పొందుపరచాలని, విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సూచించారు. చొప్పదండి పోలీస్ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామాల వారీగా పోలీసు అధికారులను నియమించాలని, కొత్తగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లు రికార్డుల నిర్వహణ, సీసీటీఎన్ఎస్, రిసెప్షన్, కోర్టు డ్యూటీ, డ్రంకెన్‌డ్రైవ్, బీట్, పెట్రోలింగ్, సమన్లు, మొదలగునవి సీనియర్ల ద్వారా తెలుసుకోవాలని సూచించారు. నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని కోరారు. వెంట ఇన్‌చార్జి సీఐ ప్రదీప్, ఎస్ఐ అనూష, సిబ్బంది ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన



చిగురుమామిడిలో ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన



మానకొండూర్‌లో..



శంకరపట్నంలో..

చిగురుమామిడి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి చిగురుమామిడి మండలశాఖ ఆధ్వర్యంలో నాయకులు నిరసన చేపట్టారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని, ఎలాంటి నోటిఫికేషన్లు విడుదల చేయొద్దని కోరుతూ డిమాండ్ చేశారు. నిరసనలో నాయకులు సాంబారి కొంరయ్య, మండలశాఖ అధ్యక్షుడు దొబ్బల బాబు, జిల్లా కార్యదర్శి కాత మల్లయ్య, నాయకులు బెజ్జంకి అంజయ్య, ఆదిమల్లయ్య, సురేశ్, కాత తిరుపతి, జిల్లాల సంపత్, కిష్టయ్య, ప్రశాంత్, మహేశ్ పాల్గొన్నారు.

మానకొండూర్: ఎస్సీ వర్గీకరణ అమలు జరిగే వరకు ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయొద్దని, విడుదలైన ఫలితాలను నిలిపివేయాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బెజ్జంకి అనిల్, ఎల్కపల్లి పాల్, మల్లేశం, రమణయ్య, శ్రీనివాస్, సంపత్, చంద్రయ్య, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: గ్రూప్స్ ఫలితాలు వేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకు వాయిదా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రామగిరి భూమయ్య, భిక్షపతి, సమ్మయ్య, రాజయ్య, లింగస్వామి, పోచయ్య, యాదగిరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్: పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచులు



జమ్మికుంటలో సర్పంచులు, వీఆర్ఏలు

ముందస్తు అరెస్టు

హుజూరాబాద్: అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్నారనే సమాచారంతో బుధవారం మండలంలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసినా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు బిల్లులను క్లియర్ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, బిల్లులను క్లియర్ చేయాలన్నారు. పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు కరుణాకర్, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, తదితరులున్నారు.

శంకరపట్నం: మండలంలోని మాజీ సర్పంచ్‌లను కేశవపట్నం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. కాచాపూర్ మాజీ సర్పంచ్ కోండ్ర రాజయ్యతోపాటు పలువురు మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్ తరలించారు.

జమ్మికుంట: మండలంలోని పలువురు సర్పంచులు, వీఆర్ఏలను టౌన్ సీఐ రవి ముందస్తు అరెస్ట్ చేశారు. అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు అవాంతరం ఏర్పడకుండా ముందస్తుగా అరెస్ట్ చేసి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశామని సీఐ తెలిపారు.